
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3

అల్లూరి సీతారామరాజు
జిల్లా వార్తలు
మంగళవారం 11 జూన్ 2024


నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్న పవన్‌కల్యాణ్

అనకాపల్లి నూకాంబిక అమ్మవారిని సోమవారం జనసేన అధినేత పవన్‌కల్యాణ్ దర్శించుకున్నారు. ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో విశాఖ చేరుకున్న ఆయన నేరుగా ఆలయానికి వచ్చారు. ఆలయంలో పవన్ కల్యాణ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విశాఖపట్నం బయలుదేరారు.

కన్నులపండువగా మోదకొండమ్మ ఉత్సవాలు

- రెండో రోజు అమ్మవారికి ఘనంగా పూజలు
- ఊరంతా విద్యుద్దీపాల అలంకరణలు
- అలరిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు
- నేడు అనుపోత్సవం...ప్రత్యేక ఏర్పాట్లు

పాడేరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి):

పాడేరు మోదకొండమ్మ ఉత్సవాలు కన్నులపండువగా జరుగుతున్నాయి. మూడు రోజుల ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారికి ఘనంగా పూజలు చేశారు. అలాగే పట్టణంలో కనులు మిరమిట్లుగొల్పేలా విద్యుద్దీపాలను అలంకరించారు. ఉత్సవ కమిటీ ఏర్పాటుచేస్తున్న వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరిస్తున్నాయి.



మోదకొండమ్మ జాతర తొలిరోజు ఆదివారం శతకంపట్టులో అమ్మవారిని కొలువుతీర్చారు. ఉదయం, సాయంత్రం అమ్మవారికి సేవలు అందిస్తున్నారు. అనుపోత్సవంలో భాగంగా అమ్మవారి ఉత్సవ విగ్రహం, పాదాలును మంగళవారం తిరిగి ఆలయంలో అనుపుతీర్చే తంతును అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. తొలి రోజును మించి ఊరేగింపులో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొంటారు. రకరకాల నృత్యాలు, వేషాలు, డప్పుల వాయిద్యాల సందడి వాతావరణంలో ఉత్సవమూర్తిని, పాదాలును ఊరేగిస్తారు. అలాగే అనుపోత్సవం ముగిసిన తర్వాత బాణసంచా కాలుస్తారు. ఇది ఉత్సవాలకే ప్రత్యేకంగా ఉంటుంది. మంగళవారం రాత్రంతా భక్తులను అలరించేందుకు సినీ, టీవీ, జానపద సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటుచేశారు. రాత్రంతా ఆయా కార్యక్రమాలను తిలకించి బుధవారం నుంచి భక్తులు స్వస్థలాలకు తిరుగు ప్రయాణమవుతారు. రెండో రోజు భక్తులకు అవసరమైన మధ్యాహ్న భోజనాలు, తాగునీరు, మరుగుదొడ్లను ఉత్సవ, ఆలయ కమిటీ ప్రతినిధులు సమకూర్చారు.

సందడే..సందడి

పాడేరులో మోదకొండమ్మ ఉత్సవ సందడి నెలకొంది. ఆలయ, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విద్యుత్ అలంకరణ, వివిధ ప్రదర్శనలు భక్తుల్లో ఉత్సాహం నింపాయి. అంబేడ్కర్ కూడలి వద్ద నలువైపులా ఏర్పాటుచేసిన ప్రత్యేక లైట్లు, ఎల్‌ఈడీ బోర్డులు కనువిందు చేస్తున్నాయి. అలాగే విశాఖపట్నం వెళ్లే మార్గం, మెయిన్ బజార్, శతకంపట్టు, ఆర్టీసీ కాంప్లెక్స్ మార్గంలో ఏర్పాటుచేసిన విద్యుత్ అలంకరణలు, అంబేడ్కర్ కూడలి వద్ద అయోధ్య ఆలయం, కోల్‌కతా కాళికా ఆలయం నమూనా లైటింగ్ ఆకట్టుకుంటున్నాయి.

అలాగే జెయింట్ వీల్, ప్లే జోన్‌లోనూ విద్యుత్ వెలుగులు జిగేల్‌మంటున్నాయి. అలాగే సాయంత్రం వేళలో ఏర్పాటు చేస్తున్న గరగర నృత్యం, కేరళ ఓనం బ్యాండ్, దేవతామూర్తుల వేషాల ప్రదర్శనలు అలరిస్తున్నాయి. పట్టణ వీధుల్లో అధిక సంఖ్యలో జనం సాంస్కృతిక కార్యక్రమాలను తిలకిస్తూ కుటుంబాలతో ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కొట్టగుళ్లి రామారావు, ప్రధాన కార్యదర్శులు టి.ప్రసాదరావునాయుడు, వై.శ్రీను, కె.వెంకటరమణ, సభ్యులు వి.రాజబాబు, డి.బాబూరావు, వి.వెంకటరత్నం, ముకుందరావు, ఎస్.శ్రీనివాసకుమార్, తదితరులు పాల్గొన్నారు.


ఉత్సవాల రెండో రోజు ప్రత్యేక అలంకరణలో మోదకొండమ్మ


అంబేడ్కర్ సెంటర్‌లో సోమవారం రాత్రి జనం సందడి. (ఇన్‌సెట్లో) అనుపోత్సవంలో ఊరేగించే అమ్మవారి ఉత్సవ విగ్రహం, పాదాలు

ఉక్కు కష్టాలు తీరేనా?

- కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు మంత్రిత్వ శాఖ సహాయమంత్రిగా నరసాపురం ఎంపీ శ్రీనివాసవర్మ
- రాష్ట్రానికి ఈ శాఖ కేటాయించడం ఇదే తొలిసారి
- కర్మాగారానికి మంచి రోజులు వస్తాయని అధికార, కార్మిక వర్గాల ఆశాభావం
- కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు పౌర విమానయాన శాఖ
- విశాఖ నుంచి ప్రత్యేక కార్గో సర్వీస్‌లకు అవకాశం
- మరింత వేగంగా భోగాపురం ఎయిర్‌పోర్టు పనులు


రామ్మోహన్‌నాయుడు


శ్రీనివాసవర్మ

విశాఖపట్నం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నానికి మంచి రోజులు వచ్చాయి. కేంద్ర ప్రభుత్వంలో రాష్ట్రానికి చెందిన ఎంపీలకు కీలక మంత్రి పదవులు దక్కడంతో ఇప్పటివరకూ ఉన్న సమస్యలు తొలగిపోనున్నాయి. శ్రీకాకుళం ఎంపీ కె.రామ్మోహన్‌నాయుడుకు కేంద్రం పౌర విమానయాన శాఖ, అదేవిధంగా నరసాపురం ఎంపీ భూపతిరాజు శ్రీనివాసవర్మకు భారీ పరిశ్రమలు, ఉక్కు మంత్రిత్వ శాఖ (సహాయ మంత్రి)లు కేటాయించారు. ఈ రెండింటి వల్ల విశాఖపట్నానికి మేలు జరగనుంది.

విశాఖపట్నం స్టీల్ ప్లాంటు ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందుల్లో ఉంది. పూర్తి స్థాయి ఉత్పత్తి జరగడం లేదు. అందుకు అవసరమైన నిధులు, ముడిపదార్థాలు లేవు. రాష్ట్రం ఏర్పాటయ్యాక కేంద్రంలో ... మిగతా 6వ పేజీలో

చినుకు పడితే వణుకు

అందుబాటులోకి రాని వంతెనలు

- కొయ్యూరు మండలంలో బండి గెడ్డపై మూడుచోట్ల వంతెనల నిర్మాణానికి రూ.6.75 కోట్లు మంజూరైనట్టు రెండేళ్ల క్రితం ఆడంబరంగా ప్రకటించిన నాటి ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి
- ఇప్పటికీ ప్రారంభం కాని రెండు వంతెనల నిర్మాణం
- రాకపోకలకు 30 గ్రామాల గిరిజనుల అగచాట్లు


వర్షాలకు ఈదులబంధ వద్ద ఉప్పొంగుతున్న బండిగెడ్డ (ఫైల్‌ఫొటో)

'మూడు వంతెనల నిర్మాణానికి రూ.6.75 కోట్లు మంజూరు చేశాం. త్వరలో పనులు ప్రారంభిస్తాం'...ఇదీ రెండేళ్ల క్రితం అప్పటి పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి చేసిన ప్రకటన. ఆయా వంతెనలపై ఆధారపడి ప్రయాణాలు సాగించాల్సిన 30 గ్రామాల ప్రజలు తమ కష్టాలు తీరినట్టేనని భావించారు. కానీ ఇప్పటికీ వంతెనలు అందుబాటులోకి రాకపోవడంతో చినుకు పడితే ఉప్పొంగే వాగుల్లో ప్రయాణం ఎలా సాగించాలా?...అని వణికిపోతున్నారు.

కొయ్యూరు, జూన్ 10:

మండల కేంద్రానికి సుదూరంగా ఉన్న యు.చీడిపాలెం, మఠంభీమవరం పంచాయతీలకు చెందిన సుమారు 30 గ్రామాల ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే మూడు కొండ వాగులు (బండిగెడ్డ) దాటాలి. వర్షాకాలంలో చినుకు పడితే కొండలపై నుంచి వచ్చే వరదతో ఈ వాగులు ఉప్పొంగి ప్రవహిస్తుంటాయి. వాగులు దాటుకుని రాకపోకలు సాగించడం పెద్ద సాహసమే అవుతోంది. దీంతో వర్షాకాలం వస్తుందంటే ఆయా గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతుంటారు. కొండల పైనుంచి వచ్చే నీరు బండి గెడ్డ ద్వారా ఏలేశ్వరం రిజర్వాయర్‌లో కలుస్తుంది.

నిత్యావసర సరకులు, అత్యవసర సమయాల్లో ఈ వాగుల్లో నుంచి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. ఈ సమస్యను ఆయా గ్రామాల ప్రజలు పలు పర్యాయాలు అధికారులు, పాలకుల దృష్టికి తీసుకువెళ్లారు. బండిగెడ్డ దాటే ప్రదేశాల వద్ద వంతెనలు నిర్మించాలని విన్నవించుకున్నారు. దీంతో 2021 జూలైలో సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు ప్రతిపాదనలు చేసి ప్రభుత్వానికి పంపారు.

నిధుల మంజూరు ప్రకటనతో సరి

ఇంజనీరింగ్ అధికారుల ప్రతిపాదనలతో మూడు వంతెనలకు నిధులు మంజూరయ్యాయి. ఈ విషయాన్ని 2022 జూలై నెలలో అప్పటి పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ఆయా పంచాయతీల్లో పర్యటించినప్పుడు ఆడంబరంగా ప్రకటించారు. గొట్టిలపాడు వంతెన నిర్మాణానికి రూ.2 కోట్లు, ఈదులబందలో వంతెనకు రూ.2.35 కోట్లు, వేమనపాలెం వద్ద వంతెన నిర్మాణానికి రూ.2.5 కోట్లు మంజూరయ్యాయని ఆమె తెలిపారు. దీంతో ఆయా పంచాయతీల పరిధిలోని 30 గ్రామాల ప్రజలు ఎంతో ఆనందించారు. ఈ నిధులతో వంతెనల నిర్మాణం పూర్తయితే వర్షాలు కురిసినా ఇబ్బంది ... మిగతా 6వ పేజీలో

ఒకటి ప్రారంభించాం.. రెండు టెండర్ల దశలో ఉన్నాయి

-రఘునాథరావునాయుడు,
ఏఈ, టీడబ్ల్యూ ఇంజనీరింగ్ విభాగం

మూడు వంతెనల నిర్మాణాలకు ఎస్‌సీఏ గ్రాంటు నుంచి నిధులు మంజూరైన విషయం వాస్తవమే. వీటిలో వేమనపాలెం వంతెన నిర్మాణ పనులను రెండు నెలల క్రితమే ప్రారంభించాం. ప్రస్తుతం పిల్లర్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మిగిలిన గొట్టిలపాడు, ఈదులబంద వంతెనల నిర్మాణాలకు సంబంధించి టెండర్లు పిలవాల్సి ఉంది.

కృష్ణాపురంలో ఎకో టూరిజం ప్రాజెక్టు

- పైన్ తోటల్లో ఏర్పాటు
- రూ.25 లక్షల నిధులతో అటవీ శాఖ నిర్మాణం
- తొలి దశలో అందుబాటులోకి 25 టెంట్లు, రెస్టారెంట్
- సీజన్ నాటికి అందుబాటులోకి తీసుకొస్తాం
- డీఎఫ్‌వో సూర్యనారాయణ పడాల్
- భవిష్యత్తులో ట్రీహట్స్, వ్యూపాయింట్, శాశ్వత గదులు నిర్మించేందుకు ప్రణాళిక




ఐ లవ్ నేచర్ బోర్డుతో ఎకో టూరిజం ప్రాజెక్టు.. (ఇన్‌సెట్లో) పర్యాటకులు బస చేసేందుకు సిద్ధం చేసిన టెంట్లు

చింతపల్లి, జూన్ 10:

ఆంధ్ర కశ్మీర్ లంబసింగి సమీపంలో గల కృష్ణాపురం పైన్ తోటల్లో అటవీ శాఖ అధికారులు నిర్మిస్తున్న ఎకో టూరిజం ప్రాజెక్టు నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి. ఈ ఏడాది సీజన్ (అక్టోబరు) నాటికి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో పనులను వేగవంతం చేశారు.

లంబసింగికి కేవలం ఆరు కిలోమీటర్ల దూరంలో చింతపల్లి-నర్సీపట్నం ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న పైన్ తోటల్లో ఎకో టూరిజం ప్రాజెక్టు నిర్మిస్తున్నారు. లంబసింగి, కొత్తపల్లి జలపాతాలు, పాడేరు, అరకు ప్రాంతాలకు వెళ్లే పర్యాటకులు ఈ మార్గంలోనే ప్రయాణించాలి. దీంతో పర్యాటకులు బస చేసేందుకు ఎకో టూరిజం ప్రాజెక్టు అత్యంత అనువుగా ఉంటుందని అటవీ శాఖ అధికారులు అంటున్నారు. సాధారణంగానే కృష్ణాపురం పైన్ తోటలు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. ఈ మార్గంలో ప్రయాణించే పర్యాటకులు ఈ తోటల వద్ద ఫొటోలు తీసుకుని కొంత సమయం విశ్రాంతి తీసుకుంటుంటారు. ఈ విషయాన్ని గుర్తించిన అటవీ శాఖ ఉన్నతాధికారులు కృష్ణాపురం పైన్ తోటల వద్ద ఎకో టూరిజం ప్రాజెక్టుకు రూపకల్పనకు శ్రీకారం చుట్టారు. తొలి విడతగా రూ.25 లక్షలు విడుదల చేయడంతో అటవీ శాఖ అధికారులు గత ఏడాది పనులు ప్రారంభించారు. ప్రస్తుతం ఎకో టూరిజం పనులు తుది దశకు చేరుకున్నాయి.

అందుబాటులోకి రానున్న సదుపాయాలు..

కృష్ణాపురం ఎకో టూరిజం ప్రాజెక్టులో ప్రాథమికంగా పర్యాటకులకు కనీస సదుపాయాలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అటవీ శాఖ ... మిగతా 6వ పేజీలో

డొంకరాయిలో విద్యుదుత్పత్తి పునఃప్రారంభం

- గ్రిడ్ అధికారులు ఆదేశిస్తే పొల్లూరులో కూడా ప్రారంభిస్తాం
- సీలేరు కాంప్లెక్సు ఏపీ జెన్‌కో చీఫ్ ఇంజనీర్ బి.శ్రీధర్


డొంకరాయిలో విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించిన అనంతరం యూనిట్ పనితీరును ఎంసీఆర్‌లో పరిశీలిస్తున్న జెన్‌కో సీఈ బి.శ్రీధర్

సీలేరు, జూన్ 10:

సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని డొంకరాయిలో సోమవారం సాయంత్రం ఆరు గంటలకు విద్యుదుత్పత్తిని పునఃప్రారంభించినట్టు ఏపీ జెన్‌కో సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ బి.శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డొంకరాయి పవర్ కెనాల్ నిర్వహణ పనులు పూర్తికావడంతో గ్రిడ్ అధికారులు నుంచి విద్యుత్ ఉత్పత్తికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారన్నారు. ఈ నేపథ్యంలో యూనిట్‌ను వినియోగంలోకి తీసుకొచ్చామన్నారు. ప్రస్తుతం పవర్ కెనాల్‌కు 8.5 అడుగుల మేర నీరు వెళుతుందన్నారు. మంగళవారం నాటికి క్రమేపీ నీటి విడుదలను పెంచుతామని సీఈ తెలిపారు. పొల్లూరు కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి చేయాలంటే ఫోర్‌బే వద్ద నీటి మట్టం (హెడ్) పెరగాల్సి ఉందని, దీనికి మూడు గంటలు సమయం పడుతుందన్నారు. అక్కడ నీటి మట్టం పెరిగినప్పటికీ గ్రిడ్ అధికారుల నుంచి ఆదేశాలు వచ్చిన తరువాత మాత్రమే విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. ప్రస్తుతం డొంకరాయిలో 1016.4 అడుగుల నీటి మట్టం ఉందని, ఆ నిల్వలతో సీలేరు కాంప్లెక్సులోని అన్ని కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామని చీఫ్ ఇంజనీర్ బి.శ్రీధర్ తెలిపారు.



క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

రాంబిల్లి, జూన్ 10: మండలంలోని ధారభోగాపురం జంక్షన్ వద్ద ఆదివారం రాత్రి 12 గంటల ప్రాంతంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు రాంబిల్లి ఎస్ఐ ముకుందరావు తెలిపారు. ఆ వ్యక్తికి సుమారు 45 సంవత్సరాలు ఉండవచ్చునన్నారు. కాగితాలు ఏరుకొనే వ్యక్తి అని, చిరునామా లేని వ్యక్తిగా గుర్తించి పంచదార్ల వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు చెప్పారు. ఆ వ్యక్తి మృతదేహాన్ని ఎలమంచిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని ఎస్ఐ ముకుందరావు తెలిపారు.

సర్వీసు వైరు మార్చుతుండగా విద్యుత్ షాక్

- స్తంభం పైనుంచి కిందపడిన హెల్పర్
- తీవ్ర గాయాలకు గురికావడంతో కేజీహెచ్‌కు తరలింపు


క్షతగాత్రుడు రమణను విశాఖపట్నం తరలిస్తున్న దృశ్యం

నర్సీపట్నం/ కృష్ణాదేవిపేట, జూన్ 10 : గొలుగొండ మండలం చోద్యం గ్రామంలో లైన్‌మేన్ వద్ద హెల్పర్‌గా పనిచేస్తున్న వ్యక్తి విద్యుత్ స్తంభం పైనుంచి కిందపడి తీవ్ర గాయాలకు గురయ్యాడు. ఇందుకు సంబంధించి అతని బంధువులు తెలిపిన వివరాలివి. సోమవారం ఉదయం చోద్యం గ్రామంలోని ఓ పాకలో స్వీట్లు తయారు చేస్తుండగా అగ్ని ప్రమాదం జరిగి సర్వీసు వైరు పాడైంది. దీంతో సదరు వైరును మార్చేందుకు లైన్‌మేన్ వద్ద హెల్పర్‌గా పనిచేస్తున్న లింగంపేట పంచాయతీ రామచంద్రపురం గ్రామానికి చెందిన చోబ్రోలు రమణ స్తంభం ఎక్కాడు. సర్వీసు వైరు మార్చే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై ఒక్కసారిగా కిందపడిపోయాడు. తీవ్ర గాయాలు కావడంతో వెంటనే అతనిని బంధువులు నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తీసుకువచ్చారు. వైద్యులు ప్రాథమిక చికిత్సల అనంతరం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. పరిస్థితి విషయమంగా ఉందని వైద్య వర్గాల ద్వారా సమాచారం.

బీరు బాటిల్‌తో దాడి: ఒకరికి గాయాలు

బుచ్చెయ్యపేట, జూన్ 10 : పాత కక్షల నేపథ్యంలో మండలంలోని వడ్డాదిలో సోమవారం బీరు బాటిల్‌తో దాడి చేయడంతో ఒక వ్యక్తి గాయపడినట్టు ఎస్ఐ డి.ఈశ్వరరావు తెలిపారు. పెద్దబజారు వీధిలోని వెంకటేశ్వరస్వామి నటనాలయం వద్ద కాళ్ళ జగదీష్‌పై దూది విజయ్‌కుమార్ అలియాస్ సాయి దాడి చేసినట్టు బాధితుడు ఫిర్యాదు చేశాడని ఎస్ఐ చెప్పారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బుద్ద జగదీష్‌ను సత్కరించిన నేతలు


బుద్ద నాగజగదీశ్వరరావును సత్కరిస్తున్న దృశ్యం

తుమ్మపాల, జూన్ 10: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ద నాగజగదీశ్వరరావును సోమవారం పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ మేరకు పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా జగదీశ్వరరావు మాట్లాడుతూ టీడీపీలో కార్యకర్తగా చేరి అంచెలంచెలుగా ఎదుగుతూ పార్టీకి సేవలందించడం జరిగిందన్నారు. పార్టీని నమ్ముకున్న వారికి కచ్చితంగా న్యాయం జరుగుతుందన్నారు. పార్టీలో సముచిత స్థానాన్ని కల్పించడంతో పాటు పలు కీలక బాధ్యతలు అప్పగించిన అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం నుంచి తీవ్ర ఒత్తిళ్ల ఎదుర్కొన్నప్పటికీ ఈ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపు కోసం కార్యకర్తల సహకారంతో కృషి చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు కోట్ని రామకృష్ణ, బోడి వెంకటరావు, కె.జగన్, మళ్ల శివన్నారాయణ, మళ్ల గణేష్, బి.మురళీ పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన అనిత


చంద్రబాబునాయుడికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే వి.అనిత

నక్కపల్లి, జూన్ 10 : పాయకరావుపేట ఎమ్మెల్యే వంగలపూడి అనిత టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడిని సోమవారం హైదరాబాద్‌లో కలిశారు. ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. చంద్రబాబు నాయుడు బుధవారం సీఎంగా ప్రమాణస్వీకారం చేయనున్న నేపథ్యంలో అభినందనలు తెలిపారు. అదేవిధంగా పాయకరావుపేట ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో గెలుపొందిన అనితను చంద్రబాబునాయుడు అభినందించారు. అనంతరం వంగలపూడి అనిత మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడిని హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో కలిసి ఘనంగా సత్కరించారు.

'ఏపీఎల్' సీజన్-3 నూతన లోగో ఆవిష్కరణ

- ఆరు జట్లు, 19 మ్యాచ్‌లు
- ఈ నెల 30 నుంచి ప్రారంభం



లోగోను ఆవిష్కరిస్తున్న శ్రీకర్ భరత్, రిక్కీ బుయ్, నితీష్‌కుమార్‌రెడ్డి

విశాఖపట్నం (స్పోర్ట్సు), జూన్ 10: ఆంధ్ర ప్రీమియర్ లీగ్ సీజన్-3 నూతన లోగోను టీమిండియా క్రికెటర్ శ్రీకర్ భరత్, ఐపీఎల్ ఆటగాళ్లు రిక్కీ బుయ్, నితీష్ కుమార్‌రెడ్డి సోమవారం ఆవిష్కరించారు. 'మన ఆంధ్ర, మన ఏపీఎల్' నినాదంతో ఈ నెల 30 నుంచి జూలై 13వ తేదీ వరకు జరిగే ఈ టోర్నీలో ఆరు ఫ్రాంచైజర్ జట్లు పాల్గొంటాయి. బెజవాడ టైగర్స్, ఉత్తరాంధ్ర లయన్స్, గోదావరి టైటాన్స్, రాయలసీమ కింగ్స్, వైజాగ్ వారియర్స్, కోస్టల్ రైడర్స్ మధ్య 19 మ్యాచ్‌లు జరగనున్నాయి. విశాఖలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో 12, కడప స్టేడియంలో ఏడు మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. ఈ ఏడాది జరిగిన ఏపీఎల్ ఆటగాళ్ల వేలంలో రైజింగ్ స్టార్స్ పేరిట మారుమూల ప్రాంతాలలోని ప్రతిభ గల 21 మంది క్రికెటర్లను గుర్తించి అవకాశం కల్పించామని ఏసీఏ కార్యదర్శి గోపీనాథరెడ్డి పేర్కొన్నారు. ఐపీఎల్‌తోపాటు దేశవాళీ టోర్నీలలో ఆంధ్ర క్రికెటర్లకు అవకాశం దక్కేందుకు ఏపీఎల్ ఒక ప్లాట్‌ఫామ్‌గా నిలుస్తుందని, ఫ్రాంచైజర్లు ఏపీఎల్ ఆటగాళ్లకు ఐపీఎల్ ఆటగాళ్ల తరహాలో అన్ని సదుపాయాలు కల్పించడం ఆహ్వానించదగ్గ విషయమని క్రికెటర్లు భరత్, రిక్కీబుయ్, నితీష్‌కుమార్‌రెడ్డి హర్షం వ్యక్తంచేశారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	125.00
లైవ్ ధర	145.00
విత్ స్కిన్	260.00
స్కిన్ లెస్	270.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	450
విజయనగరం	454
శ్రీకాకుళం	454

ప్రయాణం.. ప్రమాదం..!

- పిండ్రంగి-లంకెవన్నెపాలెం రహదారి మధ్య నల్లరాయి క్వారీ గోతులు
- 50 అడుగుల లోతున ఉంటుండడంతో పలువురు భయాందోళన
- రక్షణ గోడలు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి


దాలివలస నుంచి పిండ్రంగి- లంకెవన్నెపాలెం గ్రామాలకు వెళ్లే రహదారి

కె.కోటపాడు, జూన్ 10 : మండలంలోని పిండ్రంగి- లంకెవన్నెపాలెం రహదారి మధ్య ప్రయాణం అత్యంత ప్రమాదకరంగా మారింది. ఈ గ్రామాలకు వెళ్లే మార్గంలో ఇరువైపులా నల్లరాయి క్వారీ గోతులు ఉన్నాయి. రోడ్డు పక్కనే ఇవి యాభై అడుగుల లోతున ఉండడంతో చూసినవారు హడలిపోతున్నారు. ఆయా చోట్ల కనీసం రక్షణ గోడలు లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని పలువురు భయాందోళన చెందుతున్నారు. పిండ్రంగి


రోడ్డు పక్కనే ఉన్న భారీ క్వారీ గొయ్యి

నుంచి లంకెవన్నెపాలేనికి వెళ్లే మార్గమధ్యలో నల్లరాయి కోసం క్వారీ తవ్వకాలను చేపట్టారు. రోడ్డుకు ఆనుకుని తవ్వకాలు చేపట్టడం, ఈ క్వారీ వద్దే రోడ్డు మలుపు ఉండడంతో వాహనదారులు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా పెనుప్రమాదం తప్పదని అంటున్నారు. గతంలో ఇక్కడ ప్రమాదాలు జరిగిన సంఘటనలు కూడా ఉన్నాయని పలువురు గుర్తుచేస్తున్నారు. కె.కోటపాడు నుంచి దాలివలస మీదుగా పిండ్రంగి, లంకెవన్నెపాలెం నుంచి విజయనగరం జిల్లా ఎల్.కోట, కొత్తవలసకు దగ్గర మార్గం కావడంతో చాలా మంది వాహనదారులు ఇటుగా ప్రయాణాలు సాగిస్తుంటారు. అంతేకాకుండా లంకెవన్నెపాలెం, పిండ్రంగి చుట్టు పక్కల గ్రామాలవారు కూరగాయలు, సీజనల్‌గా పండే ఫలాలను సైతం విక్రయించేందుకు మండల కేంద్రం కె.కోటపాడులోని కె.సంతపాలెం రైతు బజారుకు రైతులు ఎక్కువగా ఇటుగానే తీసుకువస్తుంటారు. దీంతో ఆటోలు, వ్యాన్లు, బైకులతో నిత్యం ఈ ప్రాంతం రద్దీగా ఉంటుంది. ఈ మార్గంలో లోతైన క్వారీ తవ్వకాలు ఉండడం వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నారు. ఇక్కడ కనీసం రక్షణ గోడలు నిర్మించే ఏర్పాట్లను అధికారులు చేయకపోవడం దారుణమని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పగలు ఈ రహదారిలో ఎలాగోలా రాకపోకలు చేయవచ్చునని, రాత్రి సమయాల్లో కొత్తవారు ఇటుగా వస్తే జరగరానిది జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి క్వారీ గోతులు ఉన్న ప్రాంతాల్లో ఎత్తైన రక్షణ గోడలు నిర్మించడంతో పాటు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

మందకొడిగా అమృత భారత్ రైల్వే పనులు


ప్లాట్‌ఫారంపై షెడ్ల నిర్మాణానికి చేపడుతున్న దృశ్యం


ప్లాట్‌ఫారాలపై వెయింటింగ్ హాల్ నిర్మాణ పనులు జరుగుతున్న దృశ్యం

- పది నెలలైనా పూర్తి స్థాయిలో ప్రారంభం కాని వైనం
- అతీగతీ లేని రిజర్వేషన్ కమ్ బుకింగ్ కౌంటరు, మరో భవనం, కాలినడక వంతెన, ఎస్కలేటర్ పనులు

అనకాపల్లి టౌన్, జూన్ 10 : అనకాపల్లి రైల్వేస్టేషన్‌లో అమృతభారత్ పథకం పనులు కొన..సాగుతూ వస్తున్నాయి. గతేడాది ఆగస్టు 6వ తేదీన దేశవ్యాప్తంగా 508 రైల్వే స్టేషన్‌నల్లో అమృతభారత్ పథకం పనులకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. పది నెలలు దాటినా పనులు మాత్రం వేగవంతం కాలేదు. ప్రస్తుతం అధికారులు పనులు చేపట్టడంలో నిమగ్నమయ్యారు. అనకాపల్లి స్టేషన్ అభివృద్ధికి అమృతభారత్ పథకం కింద రూ.27.3 కోట్లు మంజూరయ్యాయి. శంకుస్థాపన సమయంలో అప్పటి ప్రజాప్రతినిధులు ఏడాది కాలంలో అభివృద్ధి పనులు పూర్తవుతాయని ప్రకటన కూడా చేశారు. మరో రెండు నెలలు గడిస్తే శంకుస్థాపన జరిగి ఏడాది పూర్తవుతుంది. ఈ పథకం కింద అనకాపల్లి రైల్వేస్టేషన్ రూపురేఖలే మారిపోతాయి. ప్రస్తుతమున్న ప్రధాన ముఖద్వారం వద్ద అతి పెద్ద భారీ భవనం నిర్మాణం కానుంది. ప్రస్తుతమున్న రిజర్వేషన్ కమ్ బుకింగ్ కౌంటరుకు తూర్పు భాగంలో ఒక కాలినడక వంతెన, ఎస్కలేటర్ ప్రయాణికుల సౌకర్యార్థం అందుబాటులోకి రానున్నాయి. అయితే ఈ పనులు ఇంకా ప్రారంభం కావాల్సి ఉంది. స్టేషన్‌లోని మూడు ప్లాట్‌ఫారాలపై ప్రయాణికులు ఎండకు, వానకు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఉండేలా ప్లాట్‌ఫారాల అంతటా షెడ్ల నిర్మాణం చేపడుతున్నారు. ఇప్పటికే వీటి పనులు ప్రారంభమయ్యాయి. రెండు, మూడు ప్లాట్‌ఫారాల మధ్య రైళ్లు వచ్చే వరకు విశ్రాంతి తీసుకోవడానికి వెయింటింగ్ హాల్స్, అధునాతనమైన బాత్‌రూమ్‌ల నిర్మాణ పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి. అలాగే సిగ్నలింగ్ వ్యవస్థకు సంబంధించిన పనులు కొనసాగిస్తున్నారు. ప్లాట్‌ఫారాలన్నింటినీ అధునాతనమైన టైల్స్‌తో తీర్చిదిద్దే పనులు చేపడుతున్నారు. అంతేకాకుండా ప్రయాణికులకు అవసరమయ్యే సౌకర్యాల కల్పనకు అధిక ప్రాధాన్యతనిచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం ఒకటో నంబరు ప్లాట్‌ఫారంపై పూర్తిస్థాయిలో షెడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఎస్కలేటర్, కాలినడక వంతెన, వృద్ధులు, దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసే లిఫ్ట సౌకర్యం పనులు ప్రారంభం కావాల్సి ఉంది. సాధారణంగా రైల్వే శాఖ అభివృద్ధి పనులు ప్రారంభిస్తే ఏడాదిలో పూర్తవుతాయన్నది ప్రజల్లో నమ్మకం. అయితే పది నెలలు కావస్తున్నా స్టేషన్‌లో అభివృద్ధి పనులు 50 శాతం కూడా పూర్తికాలేదు. ఈ విషయమై స్టేషన్ సూపరింటెండెంట్ సచ్చినివాస్ వద్ద ప్రస్తావించగా.. దశలవారీగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. వెయింటింగ్ రూమ్‌లు, టాయిలెట్స్, షెడ్ల నిర్మాణాలు, సిగ్నలింగ్ సిస్టమ్ పనులు జరుగుతున్నాయన్నారు. ప్లాట్‌ఫారాలపై మొజాయిక్ పనులు వేగవంతం చేశామని, తొందరలోనే రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు పూర్తవుతాయని చెప్పారు. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా స్టేషన్‌ను అభివృద్ధి పరిచేందుకు ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.

రాష్ట్రంలో దుర్మార్గ పాలనకు చరమగీతం పాడిన ఓటర్లు

- గత ప్రభుత్వ హయాంలో విద్యావ్యవస్థ సర్వనాశనం
- ప్రస్తుతం రాష్ట్రంలో విద్యకు మంచి రోజులు
- ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ

కొత్తూరు(అనకాపల్లి), జూన్ 10 : రాష్ట్రంలో గత ఐదేళ్ల దుర్మార్గ, మొండి, ఏకపక్ష, కక్ష సాధింపు ప్రభుత్వానికి అన్ని వర్గాల ప్రజలు చరమగీతం పాడారని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసనమండలి సభ్యుడు పాకలపాటి రఘువర్మ అన్నారు. అనకాపల్లి పట్టణంలోని ఏపీటీఎఫ్ కోలపర్తి అప్పారావు భవనంలో సోమవారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. చదువంటే రంగులు వేయడం, భవనాలు, బోర్డు పెట్టడమనే భావనలో ప్రభుత్వం నడిచిందన్నారు. ఒక వైపు విద్యను నిర్వీర్యం చేస్తూ గొప్ప గొప్ప ప్రకటనలతో కాలం గడిపారన్నారు. చెత్త అధికారులు, దోచుకు తినడానికి వచ్చిన సలహాదారులతో విద్యాశాఖ పూర్తిగా నిర్వీర్యం అయ్యిందన్నారు. ప్రాథమిక విద్య పూర్తిగా సర్వనాశనం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ఏ రాష్ట్రం చేయని ప్రయోగాలతో ప్రభుత్వ పాఠశాలల్లో నమోదులు గణనీయంగా తగ్గిపోయారన్నారు. విద్యా రంగ నిపుణులను సంప్రదించకుండా, ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయ శాసనమండలి సభ్యులకు తెలియకుండా నిర్ణయాలన్నీ జరిగిపోయాయన్నారు. చివరికి మాట్లాడితే అరెస్టులు, నోటీసులు, బెదిరింపులు, భయపెట్టడానికి కూడా దిగారన్నారు. ఎవరూ ఊహించని విధంగా రాష్ట్రంలో ఒక డిక్టేటర్ పాలన సాగిందనడంలో ఎటువంటి సందేహం లేదన్నారు. విద్యా రంగానికి ఉపాధ్యాయ, ఉద్యోగులకు ఈ ప్రభుత్వం చేసిన అన్యాయాలపై ఏ చర్చకైనా తాను సిద్ధమన్నారు. గత ప్రభుత్వం, పాలకుల వద్ద మెప్పు కోసం ప్రవీణ్ ప్రకాష్ వంటి అధికారులు ఉపాధ్యాయులను గందరగోళానికి, భయభ్రాంతులకు గురి చేశారన్నారు. ఇప్పుడు రాష్ట్రానికి మంచి రోజులు వచ్చాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచే విద్యా రంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారనే ఆశాభావం ఉందన్నారు. మెగా డీఎస్సీని వెంటనే ప్రకటిస్తారని చెప్పారు. ఆయన హామీ ఇచ్చిన విధంగా 117 జీవోను వెంటనే రద్దు చేస్తారన్నారు. అలాగే మరలా గ్రామాల్లోని అన్ని ప్రాథమిక పాఠశాలల్లో 1 నుంచి 5వ తరగతులు నిర్వహిస్తారన్నారు. 117జీవోలో అన్యాయం జరిగిన ఉపాధ్యాయులకు న్యాయం చేస్తారన్నారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి బి.వెంకటపతిరాజు మాట్లాడుతూ ప్రపంచ బ్యాంకు విద్యపై ఎటువంటి సూచనలు చేసినా కొత్త ప్రభుత్వం అన్ని వర్గాలతో చర్చించే నిర్ణయం తీసుకోవాలని కోరారు. సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తమరాన త్రినాథ్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలా తొందరపాటు, ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు కూడా భాగమేనని గుర్తించాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి కొటాన శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో నూతన ప్రభుత్వం విద్యారంగం, పాఠశాలల పరిరక్షణకు ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేకేఎల్ఎన్ ధర్మారావు, చిరికి దుర్గాప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు వై.శ్రీనివాసరావు, డి.నూకరాజు, కూండ్రపు సత్యనారాయణ, బలరాం, గణపతి, సన్యాసినాయుడు పాల్గొన్నారు.

మళ్లింపు మార్గంలో పలు రైళ్లు

విశాఖపట్నం, జూన్ 10: విజయవాడ డివిజన్ పరిధిలో నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో పలు రైళ్లను మళ్లింపు మార్గంలో నడిపించనున్నామని సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు. ఈనెల 10, 11, 17, 18, 24, 25 తేదీల్లో ఎర్నాకులం-పాట్నా ఎక్స్‌ప్రెస్ (22643); ఈనెల 14, 21, 26వ తేదీల్లో బెంగళూరు-గువహటి ఎక్స్‌ప్రెస్ (12509); ఈనెల 11, 18, 25వ తేదీల్లో సికింద్రాబాద్-షాలిమార్ ఏసీ ఎక్స్‌ప్రెస్ (12774); ఈనెల 11, 14, 15, 17, 18, 21, 22, 24, 25, 28, 29 తేదీల్లో ముంబాయి-భువనేశ్వర్ కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11019); ఈనెల 11, 12, 15, 16, 18, 19, 22, 23, 25, 26, 29, 30 తేదీల్లో లింగంపల్లి-విశాఖ జన్మభూమి ఎక్స్‌ప్రెస్ (12806) రైళ్ల వయా విజయవాడ, గుడివాడ, భీమవరం టౌన్, నిడదవోలు మీదుగా నడుస్తాయి. కాగా , ముంబాయి-భువనేశ్వర్ కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌కు (11019) ఏలూరు, తాడేపల్లిగూడెం స్టేషన్లలో; లింగంపల్లి-విశాఖ జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌కు (12806) నూజివీడు, ఏలూరు, తాడేపల్లిగూడెం స్టేషన్లలో హాల్ట్ ఉండదని పేర్కొన్నారు.

మళ్లింపు మార్గంలో పలు రైళ్లు

విశాఖపట్నం, జూన్ 10: విజయవాడ డివిజన్ పరిధిలో నిర్మాణ పనులు జరుగుండడంతో పలు రైళ్లను ప్రత్యామ్నాయ మార్గంలో రప్పించాలని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈ నెల 10, 11, 17, 18, 24, 25 తేదీల్లో ఎర్నాకులం-పాట్నా ఎక్స్‌ప్రెస్ (22643); ఈనెల 14, 21, 26వ తేదీల్లో బెంగళూరు-గువహటి ఎక్స్‌ప్రెస్ (12509); ఈనెల 11, 18, 25వ తేదీల్లో సికింద్రాబాద్-షాలిమార్ ఏసీ ఎక్స్‌ప్రెస్ (12774); ఈనెల 11, 14, 15, 17, 18, 21, 22, 24, 25, 28, 29 తేదీల్లో ముంబాయి-భువనేశ్వర్ కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11019); ఈనెల 11, 12, 15, 16, 18, 19, 22, 23, 25, 26, 29, 30 తేదీల్లో లింగంపల్లి-విశాఖ జన్మభూమి ఎక్స్‌ప్రెస్ (12806) రైళ్లు వయా విజయవాడ, గుడివాడ, భీమవరం టౌన్, నిడదవోలు మీదుగా నడుస్తాయి. ముంబాయి-భువనేశ్వర్ కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌కు (11019) ఏలూరు, తాడేపల్లిగూడెం స్టేషన్లలో లింగంపల్లి-విశాఖ జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌కు (12806) నూజివీడు, ఏలూరు, తాడేపల్లిగూడెం స్టేషన్లలో హాల్ట్ ఉండదని పేర్కొన్నారు.

16న జిల్లా స్విమ్మింగ్ చాంపియన్ షిప్

విశాఖపట్నం (స్పోర్ట్సు): బీచ్ రోడ్డులోని ఆక్వా స్పోర్ట్సు కాంప్లెక్సులో ఈ నెల 16న జిల్లా స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ కమ్ జిల్లా జట్టు ఎంపిక నిర్వహించనున్నట్టు జిల్లా స్విమ్మింగ్ సంఘం కార్యదర్శి మోహన్ వెంకటరామ్ తెలిపారు.

సహకార సంఘాల పర్సన్ ఇన్‌చార్జులు 70 శాతం రాజీనామా

- మిగిలినవారు ససేమిరా.. వచ్చే నెలాఖరు వరకూ గడువు
- ఆచితూచి వ్యవహరిస్తున్న సహకార శాఖ అధికారులు

విశాఖపట్నం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాలతో జిల్లాలో 70 శాతం సహకార సంఘాల పర్సన్ ఇన్‌చార్జులు రాజీనామా చేశారు. జిల్లాలో 98 సహకార సంఘాలు ఉండగా గత ప్రభుత్వం పర్సన్ ఇన్‌చార్జులను నియమించారు. ఇంకా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పాలక వర్గానికి చైర్‌పర్సన్ ఇన్‌చార్జులను నియమించారు. ఆరు నెలలకు ఒకసారి వీరి పదవీకాలం పొడిగిస్తూ వచ్చింది. వచ్చే నెలాఖరు వరకూ గడువు ఉంది. అయితే ప్రభుత్వం మారిన నేపథ్యంలో ప్రధాన కార్యదర్శి ఆదేశాలతో డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు మూడు రోజుల క్రితమే తన పదవికి రాజీనామా చేశారు.

అయితే ఉమ్మడి జిల్లాలో 98 సొసైటీల్లో 70 సంఘాల పర్సన్ ఇన్‌చార్జులు తమ పదవులకు రాజీనామా చేయగా మిగిలిన వారు ససేమిరా అంటున్నారు. తమకు నోటీసులు ఇస్తే పదవుల నుంచి వైదొలగుతామని చెప్పడంతో సహకార శాఖ అధికారులు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. వచ్చే నెలాఖరు వరకు మాత్రమే పదవీకాలం ఉన్నందున అప్పటివరకూ వేచి ఉండాలని భావిస్తున్నారు.

మార్కెట్ కమిటీ సభ్యుల రాజీనామా


రాజీనామా పత్రాన్ని కార్యదర్శికి అందిస్తున్న సభ్యులు

మాడుగుల, జూన్ 10: వైసీపీ హయాంలో నియామకమైన మాడుగుల మార్కెట్ కమిటీ సోమవారం మూకుమ్మడిగా రాజీనామాలు చేశారు. పది మందితో ఏర్పాటు చేసిన ఈ కమిటీలో చైర్మన్‌గా సేనాపతి కొండలరావు కొనసాగేవారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నిల్లో వైసీపీ ఓటమి చెందిన నేపథ్యంలో పాలకవర్గ సభ్యులు తమ పదవులకు రాజీనామాలు చేసి, సదరు పత్రాలను మార్కెట్ కమిటీ కార్యదర్శి బంగార్రాజుకు అందజేశారు.

కో-ఆపరేటివ్ బ్యాంకు త్రీమెన్ కమిటీ రాజీనామా

మాడుగుల కో-ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడిగా ఉన్న పెరుమాళ్ల వెంకటరావు సోమవారం తన పదవికి రాజీనామా చేశారు. వైసీపీ హయాంలో త్రీమెన్ కమిటీని నియమించారు. ప్రస్తుతం ఆ పార్టీ ఎన్నికల్లో ఓటమి చెందడంతో పెరుమాళ్లతో పాటు డైరెక్టర్లు గండి సుభద్ర, పాతరపల్లి వెంకటరమణ కూడా రాజీనామా చేశారు.

పీహెచ్‌సీని సందర్శించిన డీఎంహెచ్‌వో


పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

కశింకోట, జూన్ 10: స్థానిక పీహెచ్‌సీని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.బాలాజీ సోమవారం సందర్శించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అన్ని రికార్డులను తనిఖీ చేశారు. పీఎంఎస్ఎంఏ కార్యక్రమానికి ఎంత మంది గర్భిణులు వచ్చారో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ తిరుపతిరావు, జూనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, ఆరోగ్య విస్తరణాధికారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కల్కి చిత్రం ట్రైలర్ విడుదల


ట్రైలర్ ప్రారంభోత్సవ కేకు కట్ చేస్తున్న అభిమానులు

అనకాపల్లి టౌన్, జూన్ 10 : స్థానిక సత్యనారాయణ థియేటర్‌లో ప్రముఖ హీరో ప్రభాస్ నటించిన కల్కి చిత్రం ట్రైలర్‌ను విడుదల సోమవారం రాత్రి అభిమానుల కోలహాలం మధ్య విడుదల చేశారు. ఈ చిత్రం ఈ నెలాఖరున విడుదల కానున్న సందర్భంగా అనకాపల్లి పట్టణ ప్రభాస్ అభిమానులు ఈ ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా థియేటర్ ఆవరణలో రాష్ట్ర స్థాయి ప్రభాస్ ఫ్యాన్స్ కార్యవర్గసభ్యులు జీవీఎల్ఎన్ రాజు, కాండ్రేగుల జోగేంద్ర, ప్రవీణ్ సమక్షంలో థియేటర్ అధినేత కొణతాల రామలింగస్వామి కేకును కట్ చేసి అందరికీ పంచారు. ఈ కార్యక్రమంలో అభిమానులు కొణతాల అరవింద్, ఆశోక్, సతీష్‌వర్మ, శివయ్య, బుద్ద మనోహర్, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

జేఈఈలో మంచి ర్యాంకు రాలేదని విద్యార్థి ఆత్మహత్య

ఎంవీపీ కాలనీ (విశాఖపట్నం), జూన్ 10: ఇటీవల విడుదలైన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో మంచి ర్యాంకు రాలేదన్న కారణంతో ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాల మేరకు...సెక్టార్-లో నివాసం ఉంటున్న శ్రీనివాసరావు కుమారుడు సుజిత్ కుమార్ (17) ఇంటర్ పూర్తిచేశాడు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మంచి ర్యాంకు సాధించి, త్రివేండ్రంలోని ఐఐఎస్‌టీలో చేరాలనుకున్నాడు. ఆశించిన ర్యాంకు రాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై సోమవారం తన ఇంటి టెర్రస్ పైనుంచి కిందకు దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తండ్రి శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ANDHRA JYOTHI CLASSIFIEDS

ASTROLOGY

★ శ్రీ సాయిదుర్గ జ్యోతిష్యాలయం. 8 సం॥లుగా స్థిరంగా ఉన్నారు. స్త్రీ / పు ప్రేమ పెళ్ళి, వ్యాపారం, గ్రహదోష, వశీకరణ, ఎటువంటి సమస్యలకైనా 21 రోజులలో పరిష్కారం. SR మాల్ ప్రక్కన, కొత్త గాజువాక. సంప్ర॥ 7702201190
AJV_183392

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

For Advertisement Contact :
9963231176, 9966165093



కలెక్టర్ విజయసునీతతో పరుగు పందెం విజేతలు

పరుగు పందెం విజేతలకు కలెక్టర్ అభినందన

పాడేరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి పరుగు పందెం పోటీల్లో విజేతలు కొర్రా గోపి, కిల్లో బుద్దులను జిల్లా కలెక్టర్ ఎం.విజయసునీత అభినందించారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం వారణాసిలో గత నెల 20 నుంచి 28వ తేదీ వరకు యూత్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి పరుగు పందెం పోటీల్లో పాడేరుకు చెందిన కొర్రా గోపి ఐదు మీటర్లు, కిల్లో బుద్దు పది మీటర్ల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాలు సాధించారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ జిల్లా క్రీడలాభివృద్ధి అధికారి ఎ.జగన్మోహన్ ద్వారా ఇద్దరు క్రీడాకారులను సోమవారం తన కార్యాలయానికి రప్పించి అభినందించారు. అలాగే గిరిజన క్రీడాకారులకు ప్రభుత్వం తరపున అవసరమైన సహాయ సహకారాలను అందిస్తామని ఆమె హామీ ఇచ్చారు.

ఉత్సవ కమిటీ ప్రతినిధులకు ఘన సత్కారం



ఉత్సవ కమిటీ ప్రతినిధులను సత్కరిస్తున్న దృశ్యం

పాడేరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మోదకొండమ్మ ఉత్సవాలను వైభవంగా నిర్వహించిన ఉత్సవ కమిటీ ప్రతినిధులను స్థానిక వస్త్ర వ్యాపార సంఘం ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ఘనంగా సత్కరించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కొట్టగుళ్లి రామారావు, ప్రధాన కార్యదర్శులు టి.ప్రసాదరావునాయుడు, వై.శ్రీను, కె.వెంకటరమణ తదితరులకు శాలువాలు కప్పి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కొట్టగుళ్లి రామారావు, ప్రధాన కార్యదర్శులు, వస్త్ర వ్యాపార సంఘం ప్రతినిధులు రొబ్బి శంకరరావు, కొణతాల సతీశ్, వి.త్రినాథ్, వైఎస్.రావు, పరమేశ్వరరావు, వాసు తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం పోయినా పార్టీ మారను

ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు



విలేకరులతో మాట్లాడుతున్న విశ్వేశ్వరరాజు

పాడేరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): తన ప్రాణం పోయినా పార్టీ మాత్రం మారబోనని వైసీపీ ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు స్పష్టం చేశారు. ఆయన పార్టీ మారతారనే ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. తనకు రాజకీయంగా ఎంతో తోడ్పాటునిచ్చి, నేడు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించిన వైసీపీని వీడే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. అలాగే గతంలో తన సతీమణి శివనాగరత్నం గూడెంకొత్తవీధి జడ్పీటీసీ సభ్యురాలుగా, తనకు ఎస్టీ కమిషన్ సభ్యుడిగా వైసీపీ అవకాశం కల్పించిందని పేర్కొన్నారు. తన ప్రాణం ఉన్నంత వరకు వైసీపీలోనే కొనసాగుతానన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కె.కోటినాయుడు, సీదరి మంగ్లన్నదొర, సత్తిబాబు, రాంబాబు పాల్గొన్నారు.

మోదకొండమ్మ చీరల కొనుగోలుకు పోటీ



అమ్మవారి చీరలు కొనుగోలు చేస్తున్న మహిళలు

పాడేరు రూరల్, జూన్ 10: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం పాడేరు మోదకొండమ్మకు భక్తుల సమర్పించిన చీరలను కొనుగోలు చేసేందుకు మహిళలు పోటీ పడ్డారు. భక్తులు అమ్మవారికి పసుపు కుంకుమలతో పాటు చీరలు సమర్పించుకుంటారు. గత ఏడాది నుంచి ఈ చీరలను ఉత్సవాల సమయంలో ఆలయ ప్రాంగణంలో విక్రయిస్తున్నారు. ముందుగానే చీరలను కమిటీ ప్రతినిధులు నాణ్యతను బట్టి వేరుచేసి వర్తక వ్యాపారులతో ధరలను నిర్ణయిస్తారు. అనంతరం వాటిని బహిరంగ వేలం, నిర్ణీత ధరలకు అమ్మకాలు చేపట్టడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా సోమవారం అమ్మవారి చీరలను అమ్మకానికి పెట్టారు. వీటి కోసం మహిళలు పోటీపడ్డారు. అమ్మవారి చీరను కొనుగోలు చేసి ఇంటిలో భద్రపరుచుకుంటే ఎంతో లాభదాయకమని, మంచి జరుగుతుందని ఈ ప్రాంత మహిళల నమ్మకం. కార్యక్రమంలో ఆయన ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలం నాయుడు, ఆలయ, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి రామ్మోహన్‌ను కలిసిన రాజారావు



రామ్మోహన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న రాజారావు

పాడేరు రూరల్, జూన్ 10: శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు కేంద్ర మంత్రిగా ఆదివారం ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాంగి రాజారావు సోమవారం ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. రామ్మోహన్ నాయుడుకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామ్మోహన్‌నాయుడు వంటి యువ నాయకులు దేశానికి ఎంతో అవసరమన్నారు. మన రాష్ట్రానికి మూడు కేంద్ర మంత్రి పదవులు రావడం గర్వించదగ్గ విషయమన్నారు. కేంద్రమంత్రిని కలిసిన వారిలో రాజారావుతో పాటు శ్రీకాకుళం బీజేపీ నేతలు పూడి తిరుపతిరావు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టులో భారీ వర్షం



ముంచంగిపుట్టులో కురుస్తున్న వర్షం

ముంచంగిపుట్టు, జూన్ 10: మండల పరిధిలో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తారెత్తించింది. ఎండ వేడికి పిల్లలు, వయసు పైబడిన వారు తీవ్రమైన ఇబ్బందులు పడాల్సి వచ్చింది. మధ్యాహ్నం నుంచి ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఉరుములు మెరుపులతో భారీ వర్షం మొదలైంది. ఇళ్ల పరిసరాల నుంచే వర్షపు నీరు ఉధృతంగా ప్రవహించింది. అలాగే రహదారులపై పలు చోట్ల నుంచి వర్షం నీరు ప్రవహించింది. దీంతో రహదారులు కోతకు గురయ్యాయి. మట్టి రహదారులు రూపు రేఖలు కోల్పోయాయి. దీంతో వాహన చోదకులు ప్రత్యక్ష నరకం చవిచూడాల్సి వచ్చింది.

ప్రమాదకరంగా రహదారుల అంచులు

- వాహన చోదకులకు తప్పని ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



చోటాముఖిపుట్టు సమీపంలో కోతకు గురైన రహదారి అంచులే

ముంచంగిపుట్టు, జూన్ 10: మండల కేంద్రం నుంచి పెదబయలు, జోలాపుట్టు, సంగడ వెళ్లే ప్రధాన రహదారుల అంచులు ప్రమాదకరంగా మారాయి. దీంతో వాహన చోదకులకు ఇబ్బందులు తప్పడం లేదు. వివరాల్లోకి వెళితే... రహదారులు పొడుగునా ఇరువైపులా అంచులు పలు చోట్ల కోతకుగురయ్యాయి. అలాగే రహదారులు పొడుగునా పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. దీంతో ఇటుగా రాకపోకలు సాగించే వాహన చోదకులు తరచూ ప్రమాదాలబారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు మాత్రం తమకేమీ పట్టదన్నట్లుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పెదబయలు నుంచి మండల కేంద్రం మీదుగా జోలాపుట్టు వరకు సుమారు 32 కిలోమీటర్ల తారురోడ్డు ఉంది.

అలాగే మండల కేంద్రం నుంచి సంగడ వరకు 35 కిలోమీటర్లు, కుమడకు 11 కిలోమీటర్లు ప్రధాన రహదారి ఉంది. అయితే ప్రధాన రహదారులు పొడుగునా రాతి పేర్పు చేపట్టి మట్టిని పోసి లోలరింగ్ చేయాల్సి ఉంది. అలాగే వర్షా కాలంలో వరదనీరు రహదారులపై నుంచి ప్రవహించకుండా తగు చర్యలు చేపట్టాలి. కానీ అధికారులు ఆ దిశగా కనీస దృషిసారించడంలేదు. దాని పర్యావసంగా ప్రధాన రహదారులు అత్యంత ప్రమాదబరితంగా మారాయి. ప్రమాదబరిత మలుపులు, రహదారులు ఇరువైపుల పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో పాటు రహదారులు అంచులు ప్రమాదబరితంగా మారడంతో అటుగా రాకపోకలు సాగించే వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. అడుగులుపుట్టు, రంగినిగెడ్డ, కిలగాడ, వనభసింగి, కించాయిపుట్టు, రాజ్‌మామిడి, పనసపుట్టు, బోంద్రుగూడ, మాకవరం, అస్త్రాడ, సంగడ, కుమడ, కరిముఖిపుట్టు తదితర ప్రాంతాల్లో రహదారులు ఇరువైపులా అంచులు ఎక్కువగా దెబ్బతినడంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు తప్పుకునేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అలాగే రహదారులు పొడుగునా పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో ఎదురెదురుగా వాహనాలు దగ్గరకు వస్తేగానీ గుర్తించలేని పరిస్థితి నెలకొంది. దీంతో పలు సందర్భాల్లో ప్రమాదాలకు గురవుతున్నామని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పెను ప్రమాదాలు జరగకముందే ప్రధాన రహదారుల బాగోగులపై దృష్టి శారించాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

గబుడుపుట్టు డీఆర్ డిపో సేల్స్‌మన్‌పై వేటు

- విధుల నిర్వహణలో నిర్లక్ష్యమే కారణం
- జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి శ్రీహరి



తహసీల్దార్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్‌వో శ్రీహరి

పెదబయలు, జూన్ 10: రేషన్ బియ్యాన్ని నల్ల బజారుకు తరలిస్తున్న మండలానికి చెందిన జీసీసీ సేల్స్‌మన్‌పై వేటు వేసినట్టు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి సి.శ్రీహరి తెలిపారు. ఇంజరి పంచాయతీ గబుడుపుట్టు గ్రామంలో గిరిజన సహకార సంస్థ ద్వారా నడుపుతున్న 0-30-211 డీఆర్ డిపోలో కాంట్రాక్ట్ సేల్స్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్న కొర్ర మల్లేశ్వరరావు స్థానికంగా ఉండకుండా అతనికి సహాయకునిగా కొర్ర తిమోతిని నియమించుకొని రేషన్ పంపిణీ చేసేవాడు. ఈ నెల 8న సాయంత్రం 7 గంటల సమయంలో గబుడుపుట్టు డిపో నుంచి రెండు ఆటోల్లో 4847 కిలోల రేషన్ బియ్యం, 100 కిలోల పంచదారను అక్రమంగా తరలిస్తుండగా, మద్దిగరువు వద్ద స్థానికులు పట్టుకొన్నారు. దీంతో ఆటో డ్రైవర్లు రేషన్ సరుకులను అక్కడే విడిచిపెట్టి పరారయ్యారు. దీనిపై గ్రామస్థులు ఫోటోలు, వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో పాటు, అక్రమంగా రేషన్ సరుకు తరలిస్తున్న వాహనాన్ని తిరిగి డిపో వద్దకు చేర్చారు. ఈ వ్యవహారమై గ్రామస్థుల ఫిర్యాదు మేరకు సోమవారం అధికారులు గబుడుపుట్ గ్రామాన్ని సందర్శించి బహిరంగ విచారణ చేపట్టారు. సేల్స్‌మన్ స్థానికంగా ఉండకుండా 60 కిలోమీటర్ల దూరం అయినా పాడేరులో ఉంటూ వేరొకరి చేత రేషన్ పంపిణీ చేస్తున్నాడని, ఈ సేల్స్‌మన్‌ను తొలగించాలని గ్రామస్థులు కోరారు.

దీంతో విధులను నిర్లక్ష్యం చేయడమే కాకుండా అక్రమాలకు పాల్పడుతున్న సేల్స్‌మన్ మల్లేశ్వరరావుపై నిత్యావసరాల చట్టం-1955లో 6ఏ కేసు నమోదు చేసి ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నట్టు డీఎస్‌వో తెలిపారు. అలాగే ఈ అక్రమానికి పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు కింద 17 ఈసీ చట్టం కింద కేసులు పెట్టేందుకు పోలీస్ శాఖకు లెటర్ రాయమని సబ్ కలెక్టర్ ఆదేశించారని ఆయన చెప్పారు. సోమవారం నుంచి గబుడుపుట్టు డిపో బాధ్యతలను లక్ష్మీపేట డిపోలో సేల్స్‌మన్ కరిదేశి బుజ్జిబాబుకు అప్పగించినట్టు తెలిపారు.

జీసీసీ ద్వారా నడుపుతున్న డీఆర్ డిపోలలో సేల్స్‌మేన్లు ఇలా సహాయకులను పెట్టుకొని విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని డీఎస్‌వో స్పష్టం చేశారు. ఆయన వెంట తహసీల్దార్ రామ్మోహనరావు, జీసీసీ బ్రాంచ్ మేనేజర్ గాని, ఆర్ఐ సింహాచలం తదితరులు ఉన్నారు.

స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలి

- దండకారణ్య ఉద్యోగ సమితి రాష్ట్ర అధ్యక్షుడు మాణిక్యం



విలేకరులతో మాట్లాడుతున్న మాణిక్యం తదితరులు

పాడేరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల కోసం ప్రత్యేక డీఎస్సీని ప్రకటించాలని దండకారణ్య ఉద్యోగ సమితి రాష్ట్ర అధ్యక్షుడు సమరెడ్డి మాణిక్యం కోరారు. సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జీవో-3 రద్దుతో షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల్లో గిరిజనులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఈ సమస్యను గుర్తించిన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, తమ పార్టీ అధికారంలోకి వస్తే జీవో-3ను పునరుద్ధస్తామని అరకులోయ బహిరంగ సభలో హామీ ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌లో భాగంగా గిరిజనులకు సంపూర్ణ న్యాయం జరిగేలా స్పెషల్ డీఎస్సీ ప్రకటించాలన్నారు. షెడ్యూల్డ్ ప్రాంతంలోని ఉపాధ్యాయ పోస్టులను శత శాతం గిరిజనులకే ఇవ్వాలని గతంలో ఎన్‌టీఆర్ జీవో-275 తీసుకువస్తే, ఆ తర్వాత చంద్రబాబునాయుడు జీవో-3 తీసుకువచ్చారన్నారు. రెండేళ్ల క్రితం జీవో-3ను సుప్రీం కోర్టు రద్దు చేయడంతో గిరిజనులకు ఉద్యోగాల్లో ప్రత్యేక రిజర్వేషన్ లేకుండాపోయిందని మాణిక్యం ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనుల కోసం ప్రత్యేక డీఎస్సీ ప్రకటించకుండా సాధారణ మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టుల భర్తీ జరిగితే ఒక తరం గిరిజనులు పూర్తిగా నష్టపోతారన్నారు. అలాగే కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ పద్ధతుల్లో ఉన్న ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దండకార్యణ ఉద్యోగ సమితి నేతలు చెండా కేశవరావు, రాజుబాబు, కిల్లో భీమరాజు, జి.ధనుంజయ్, అప్పలకొండ, యూటీఎఫ్ నేత నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎత్తు మడుల్లో పసుపు నాట్లతో ఎంతో మేలు

- టాటా ట్రస్టు ప్రొగ్రాం అసోసియేట్ సుదర్శన్



ఎత్తు మడుల్లో పసుపు నాట్లపై రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

చింతపల్లి, జూన్ 10: ఆదివాసీ రైతులు ఎత్తు మడుల్లో (బెడ్స్) పసుపు నాట్లు వేసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చునని విజయ వాహిని చారిటబుల్ ఫౌండేషన్, టాటా ట్రస్ట్ ప్రొగ్రాం అసోసియేట్ సుదర్శన్ అన్నారు. సోమవారం చింతపల్లి మండలం గొందిపాకలు, అసరాడ, పెద్దబరడ, చిన్నబరడ, గత్తంపాకలు గ్రామాల్లో ఎత్తు మడులు (బెడ్స్)లో పసుపు నాట్లు వేసుకునే విధానంపై రైతులకు సాంకేతిక నిపుణులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పసుపు సాగులో గిరిజన రైతులు దేశవాళి రకం విత్తనాలను నేరుగా పంట పొలాల్లో నాటు కోవడం వల్ల నాణ్యమైన దిగుబడులు పొందలేకపోతున్నారన్నారు. రైతులు బెడ్స్‌ను సిద్ధం చేసుకుని పసుపు విత్తనం నాటు కోవడం వల్ల దిగుబడులు పెరుగుతాయన్నారు. అధిక వర్షాల వల్ల మొక్కలకు నష్టం కలగదన్నారు. దుంపకుళ్లు తెగులును సైతం తట్టుకుంటుందన్నారు. రైతులు మేలిజావి తల్లిదుంప(విత్తనం) ఎంపిక చేసుకుని ట్రైకోడెర్మ విరిడి ద్రావణంలో విత్తన శుద్ధిచేసుకుని నాట్లు వేసుకోవాలన్నారు. పసుపు సాగులో కచ్చితంగా మెలకువలు పాటించాలన్నారు. కాఫీ మొక్కల్లో ఎండు కొమ్మలను తొలగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రస్టు సీఆర్‌పీలు బాలయ్యదొర, శ్రీదేవి, అశోక్, దేముడు, అనురాధ పాల్గొన్నారు.

ఉక్కు కష్టాలు తీరేనా?

... 3వ పేజీ తరువాయి

ఉక్కు శాఖా మంత్రి పదవి తొలిసారి లభించింది. దక్షిణ భారతదేశంలో తీర ప్రాంతానున్న ఏకైన ప్రభుత్వ కర్మాగారం ఇదే. ఇక్కడ ఏడాదికి 80 లక్షల టన్నుల ఉక్కును ఉత్పత్తి చేయవచ్చు. దీని ద్వారా రూ.50 వేల కోట్ల ఆదాయం వస్తుంది. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు జీఎస్‌టీ ద్వారా 18 శాతం అంటే రూ.9 వేల కోట్లు ఆదాయం వస్తుంది. ఇవన్నీ జరగాలంటే స్టీల్ ప్లాంటు నిర్వహణకు అవసరమైన నిర్వహణ మూలధనం సమకూర్చాలి. బ్యాంకుల నుంచి రుణం దొరకడానికి రాష్ట్రపతి పేరిట ఉన్న ఉక్కు భూములను ఆర్ఐఎన్ఎల్ పేరిట మార్పించాలి. అప్పుడే సంస్థకు ఆర్థిక పరపతి పెరిగి మార్కెట్‌లో రుణాలు లభిస్తాయి. ఆ దిశగా చర్యలు చేపట్టాల్సి ఉంది. దీనివల్ల మంచి జరుగుతుంది. మంత్రి మనవారే కావడం వల్ల ఇవన్నీ సులువు అవుతాయని విశాఖ ఉక్కు అధికార, కార్మిక సంఘాలు భావిస్తున్నాయి.

కార్గో విమాన సర్వీసులకు అవకాశం

కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు పౌర విమానయాన శాఖ రావడం పట్ల ఏపీ విమాన ప్రయాణికుల సంఘం హర్షం వ్యక్తంచేసింది. విశాఖపట్నానికి ఎప్పటి నుంచో కార్గో విమాన సర్వీసులు లేవు. ఇక్కడి నుంచి విదేశాలకు సముద్ర ఉత్పత్తులు, మందులు, దుస్తులు, ఇతర ఆహార ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయి. అయితే ప్రత్యేకంగా కార్గో విమానాలు లేకపోవడం వల్ల సముద్ర మార్గాల ద్వారా ఎగుమతి చేస్తున్నారు. దీనికి ఎక్కువ సమయం పడుతోంది. వ్యయం అవుతోంది. మంత్రి ఈ ప్రాంతానికి చెందినవారే కావడం వల్ల కార్గో విమాన సర్వీసులు వీలైనంత త్వరగా తెచ్చుకునే వీలుంది. అంతేకాకుండా రద్దయిన దుబాయ్, శ్రీలంకతో పాటు ఇతర విదేశాలకు కొత్త సర్వీసులు తెచ్చుకోవచ్చు. అదేవిధంగా భోగాపురంలో కొత్త అంతర్జాతీయ విమానాశ్రయం మరింత త్వరగా అందుబాటులోకి తెచ్చుకునే వీలుంది. ఈ ఇద్దరు మంత్రుల వల్ల విశాఖకు మేలు జరుగుతుందని ఈ ప్రాంత ప్రజలు ఆశిస్తున్నారు.

కృష్ణాపురంలో ఎకో టూరిజం ప్రాజెక్టు

... 3వ పేజీ తరువాయి

అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఎకో టూరిజం ప్రాజెక్టు వద్ద తొలివిడతగా పర్యాటకులు బస చేసేందుకు 15 సింగిల్, 10 డబుల్ టెంట్లు ఏర్పాటు చేశారు. రన్నింగ్ వాటర్, అంతర్గత రోడ్లు, మెయిన్ గేట్ నిర్మించారు. టికెట్ కౌంటర్, మరుగుదొడ్ల నిర్మాణం 80 శాతం పూర్తిచేశారు. భవిష్యత్తులో ట్రీ హట్స్, వ్యూపాయింట్, శాశ్వత గదులు నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు.

ఏడాది పొడవునా సందర్శనకు అనువుగా..

ఎకో టూరిజం ప్రాజెక్టును పర్యాటకులు ఏడాది పొడవునా సందర్శించేందుకు అనువుగా తీర్చిదిద్దనున్నారు. సందర్శకుల వినోదం కోసం పలురకాల క్రీడలు ఏర్పాటు చేయనున్నారు. పర్యాటకులు, స్థానికులు వన భోజనాలు చేసేందుకు అనువుగా కొంత విస్తీర్ణం కేటాయించారు. ఆ ప్రాంతాన్ని పూలమొక్కలు, క్రోటాన్స్‌తో అలంకరిస్తున్నారు. అలాగే ఓపెన్‌గా విందు, వినోద కార్యక్రమాలు నిర్వహించేందుకు అనువుగా అటవీ శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎకో టూరిజంలో విశాలమైన పార్కింగ్‌తోపాటు పర్యాటకుల భద్రత కోసం 24 గంటలు టాస్క్‌ఫోర్సు ఉద్యోగులు విధుల్లో ఉంటారు.

సీజన్ నాటికి ఎకో టూరిజం ప్రాజెక్టు

-చిట్టపుల్లి సూర్యనారాయణ పడాల్, డివిజనల్ ఫారెస్టు అధికారి, చింతపల్లి



కృష్ణాపురం పైన్ తోటల్లో నిర్మిస్తున్న ఎకో టూరిజం ప్రాజెక్టు సీజన్ నాటికి అందుబాటులోకి వస్తుంది. పర్యాటకులు బస చేసేందుకు అనువైన సదుపాయాలు కల్పిస్తున్నాము. మరో మూడు నెలల్లో మరుగుదొడ్లు, రెస్టారెంట్ నిర్మాణాలు పూర్తిచేస్తాం. అక్టోబరు నాటికి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుంది. నవంబరు నుంచి లంబసింగికి పర్యాటకుల సందర్శనలు ప్రారంభం కానున్నాయి. లంబసింగి సందర్శించే పర్యాటకులు ప్రకృతిని ఆస్వాదిస్తూ ఎకో టూరిజం ప్రాజెక్టు వద్ద బస చేయవచ్చు.

సంక్షిప్తంగా..

ఘనంగా బాలకృష్ణ జన్మదిన వేడుకలు



బాలకృష్ణ జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

పాడేరు రూరల్, జూన్ 10: ప్రముఖ సినీ నటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కిండంగి పంచాయతీ కేంద్రంలో పార్టీ శ్రేణులు, అభిమానుల మధ్య కేక్ కట్ చేశారు. జై బాలయ్య అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి బొర్రా విజయరాణి, నాయకులు బక్కా జగదీష్, నాగార్జున, కృష్ణమరాజు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

13న ఈఎంఆర్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రవేశాలకు కౌన్సెలింగ్

చింతపల్లి, జూన్ 10: పాడేరు గిరిజన సంక్షేమ శాఖ బాలికల గురుకుల కళాశాల ఆవరణలో ఈ నెల 12న ఏకలవ్య ఆదర్శ నివాసానుబంధ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్టు స్థానిక ప్రిన్సిపాల్ అన్నామణి తెలిపారు. సోమవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈఎంఆర్ జూనియర్ కళాశాలలో మిగులు సీట్లు భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు కోరడం జరిగిందన్నారు. వివిధ గ్రూప్స్‌లో ప్రవేశాలు పొందేందుకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థినీ, విద్యార్థులు టీసీ, మార్కుల జాబిత, స్టడీ, కులం, ఆదాయం ధ్రువపత్రాలు, రేషన్, ఆధార్ కార్డు ఒరిజినల్స్‌తో హాజరుకావాలన్నారు. విద్యార్థులకు కౌన్సెలింగ్ ద్వారా చింతపల్లి, జీకేవీధి, డుంబ్రిగుడ, ముంచంగిపుట్టు ఈఎంఆర్ కళాశాలల్లో ప్రవేశాలు కల్పించడం జరుగుతుందన్నారు.

వంగసార బాలికల ఆశ్రమ పాఠశాలలో ప్రవేశాలు

చింతపల్లి, జూన్ 10: మండలంలో వంగసార గిరిజన సంక్షేమశాఖ బాలిక ఆశ్రమ పాఠశాలలో మూడు నుంచి పదోవ తరగతి వరకు ఖాళీగానున్న సీట్లలో విద్యార్థినులకు ప్రవేశాలు కల్పిస్తున్నట్టు పీజీహెచ్‌ఎం పి. ప్రసాదరావు తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పాఠశాలలో మూడోవ తరగతిలో 80సీట్లు, నాలుగులో 69, ఐదు 51, ఆరు 41, పదోవతరగతిలో 17సీట్లు ఖాళీగా వున్నాయని తెలిపారు. గిరిజన విద్యార్థినులు పాఠశాలల్లో ప్రవేశాలు పొందేందుకు రికార్డుషీట్(టీసీ), స్టడీ, కులం, ఆదాయం ధ్రువపత్రాలు, రేషన్, ఆధార్ కార్డు, విద్యార్థిని పాస్ ఫొటోలు ఒరిజినల్స్‌తో తీసుకొచ్చి ప్రవేశాలు పొందవచ్చునన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రావికమతం జడ్పీటీసీ సభ్యురాలు రమణమ్మ కన్నుమూత



రమణమ్మ (ఫైల్)

రావికమతం, జూన్ 10: రావికమతం జడ్పీటీసీ సభ్యురాలు తలారి రమణమ్మ (57) సోమవారం సాయంత్రం కన్నుమూశారు. ఆమె గత కొంతకాలంగా అనారోగ్యంతో విశాఖపట్నంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అయినప్పటికీ ఫలితం లేకపోయిందని, సోమవారం సాయంత్రం తుది శ్వాస విడిచారని కుటుంబ సభ్యులు తెలిపారు. మండలంలోని మేజర్ పంచాయతీ కొత్తకోటకు చెందిన రమణమ్మ గతంలో పంచాయతీ వార్డు సభ్యురాలిగా, శివాలయం ధర్మకర్తల మండలి సభ్యురాలిగా పనిచేశారు. 2019లో వైసీపీ తరఫున జడ్పీటీసీ సభ్యురాలిగా పోటీ చేసి గెలుపొందారు. ప్రస్తుతం ఆమె చోడవరం నియోజకవర్గ వైసీపీ మహిళా విభాగం అధ్యక్షురాలిగా కూడా ఉన్నారు. బుచ్చెయ్యపేట జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబుకు వియ్యపురాలు కూడా. రమణమ్మ మృతికి మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు సంతాపం తెలిపారు.

చినుకు పడితే వణుకు

...3వ పేజీ తరువాయి

ఉండబోదనుకున్నారు. తీరా రెండు సంవత్సరాలు అవుతున్నా ఇప్పటికీ రెండు వంతెనల పనులు ప్రారంభించనేలేదు.

రవాణా సమస్య యథాతథం..

వంతెనల నిర్మాణం కార్యరూపం దాల్చకపోవడంతో 30 గ్రామాల గిరిజనుల రవాణా కష్టాలు తీరలేదు. సంబంధిత అధికారులు కూడా ప్రతిపాదనలు చేయడంతోనే తమ పనైపోయిందని పట్టించుకోవడం మానేశారు. వర్షాకాలం ప్రారంభం కానుండడంతో ఈ వంతెనల నిర్మాణాలు చేపట్టడానికి పాలకులు, అధికారులు తక్షణమే తగిన చర్యలు చేపట్టాలని వారు వేడుకుంటున్నారు. ఈ మేరకు 30 గ్రామాలు ప్రజలు మూకుమ్మడిగా జిల్లా కలెక్టర్‌ను కలిసేందుకు సన్నద్ధమవుతున్నారు.